సాక్షి
అనకాపల్లి
గురువారం । 27 । ఏప్రిల్ । 2023



వైఎస్సార్ కంటి వెలుగు

వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి అమర్‌నాథ్ కోరారు. 8లో



ఇండస్ట్రియల్ ఎక్స్‌పో

విశాఖ: ఆటోనగర్ డీ- బ్లాక్‌లోని నరిపల్లి గ్రాండ్‌లో 27, 28, 29వ తేదీల్లో ఇండస్ట్రియల్ కమ్ బిజినెస్ ఎక్స్‌పో-2023 జరగనుంది.



జడ్జిలకు సత్కారం

విశాఖ: బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులు జి.గోపి, బులికృష్ణలను స్మార్ట్‌సిటీ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సత్కరించింది.

న్యూస్‌రీల్

మహిళా బాక్సర్లకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: రాష్ట్రస్థాయి సీఎం కప్ బాక్సింగ్ టోర్నమెంట్‌కు ఎంపికైన సీనియర్ విమెన్ బాక్సర్లను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో బుధవారం అభినందించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు తిరుపతిలో మే ఒకటి నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్న పోటీల్లో నర్సీపట్నానికి చెందిన కొలుకుల కృష్ణవేణి (65 కిలోలు), వేపాడ ప్రియాంక (75 కిలోలు), బొంతు మౌనిక (80 కిలోలు) విభాగాల్లో పాల్గొంటున్నారని కోచ్ అబ్బు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి నర్సీపట్నానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే క్రీడాకారులకు సూచించారు. క్రీడాకారులకు ఎస్ఏఎన్ కళాశాల ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు, కరస్పాండెంట్ ఎస్.ఉమామహేశ్వరి రూ.10 వేల నగదు ప్రోత్సాహం అందజేశారు. నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉత్తరాంధ్ర టెన్నిస్ డబుల్ టోర్నమెంట్

అనకాపల్లి టౌన్: స్థానిక జార్జ్ క్లబ్ ఆవరణలో ఉత్తరాంధ్ర స్థాయి టెన్నిస్ డబుల్ టోర్నమెంట్‌ను (45 సంవత్సరాలు పైబడిన పురుషులకు) ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ కె.ఎన్.గాంధీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు అందజేస్తామన్నారు. ఉదయం, సాయంత్రం (ఫ్లడ్ లైట్ వెలుగుల్లో) క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440357499 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

సీజ్ చేసిన వాహనాల వేలం 29న

అనకాపల్లి టౌన్: అనకాపల్లి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 29వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జిల్లా అధికారి జె.రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వ్యక్తులు అదేరోజున రూ.3 వేలు ధరావత్తు చెల్లించాలని ఆయన కోరారు. వేలం పాటను మండలంలో గుండాల జంక్షన్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంపాటలో వాహనాన్ని పాడుకోలేని వారికి వారు చెల్లించిన ధరావత్తు తిరిగి చెల్లిస్తామని ఆయన తెలిపారు.

అనకాపల్లి డీఎస్పీగా సుబ్బరాజు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి డీఎస్పీగా వి.సుబ్బరాజును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్నారు. ఇక్కడ గతంలో డీఎస్పీగా విధులు నిర్వహించిన బి.సునీల్‌ను విశాఖ క్రైం విభాగం డీఎస్పీగా బదిలీ చేసినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి.

రోడ్డు విస్తరణపై పబ్లిక్ నోటీసు జారీ

నర్సీపట్నం: వేంకటేశ్వరస్వామి గుడి నుంచి పెద బొడ్డేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 40 అడుగుల మేర రోడ్డు విస్తరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు తెలిపారు. మెయిన్‌రోడ్డుతోపాటు బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.16.60 కోట్లు మంజూరు చేసిందన్నారు. బైపాస్ రోడ్డును 2.5 కిలోమీటర్ల వరకు 40 అడుగుల మేర విస్తరిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఎఫ్ఎంబీ రికార్డు ప్రకారం రోడ్డు విస్తరణకు అవసరమైన రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ ముసాయిదాను తయారు చేశామన్నారు. ముసాయిదాను రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ ఆమోదం నిమిత్తం పంపిస్తామన్నారు. రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రతిపాదనపై సూచనలు, సలహాలు చేయాలనుకునే వారు మే 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు లిఖితపూర్వకంగా కార్యాలయంలో సమర్పించాలని కమిషనర్ పేర్కొన్నారు.

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ఈ సీజన్‌లో అరకు వెళ్లే రైల్వే ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖలో మే 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30 తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్(08551)రైలుకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో మే 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, 31 తేదీల్లో బయల్దేరే కిరండూల్-విశాఖపట్నం(08552)రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

బాలికలదే పైచేయి

- ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ
- ఫస్టియర్‌లో 63 శాతం, సెకండియర్‌లో 70 శాతం ఉత్తీర్ణత
- గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత శాతం



విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా గతంలో కంటే కాస్తా మెరుగుపడింది. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 63 శాతం, ద్వితీయ సంవత్సరంలో 70 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొదటి సంవత్సరం పరీక్షలకు 50,647 మంది హాజరుకాగా 31,957 మంది పాసయ్యారు. రెండో సంవత్సరం 42,248 మంది పరీక్షలు రాయగా 29,755 మంది పాసయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు రాష్ట్ర సూచికలో మొదటి సంవత్సరంలో ఐదో స్థానం, రెండో సంవత్సరం ఫలితాల్లో ఆరో స్థానం దక్కింది.

రెండింటిలోనూ బాలికలే..

ఫలితాల్లో బాలురు కంటే బాలికలదే పైచేయిగా నిలిచింది. మొదటి సంవత్సరం బాలురు 25,806 మంది పరీక్షలకు హాజరుకాగా 15,835 మంది పాసయ్యారు. తద్వారా 61 శాతం నమోదైంది. బాలికలు 24,841 మంది పరీక్ష రాయగా 16,122 మంది పాసయ్యారు. 65 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం బాలురు 20,459 మంది పరీక్ష రాయగా 14,017 మంది పాసయ్యారు. తద్వారా 69 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 21,789 మంది పరీక్ష రాయగా 15,738 మంది పాసయ్యారు. తద్వారా 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో బాలుర కంటే బాలికలే ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు.

ఒకేషనల్‌లోనూ అమ్మాయిలే టాప్

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్‌లో 1,458 మంది బాలురు పరీక్ష రాయగా 504 మంది పాసయ్యారు. 35 శాతం ఉత్తీర్ణత వచ్చింది. బాలికలు 2,922 మందికి గాను 1,705 మంది పాసయ్యారు. 58 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో బాలురు 1,215 మందికి గాను 644 మంది పాసయ్యారు. 53 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 2,568 మందికి గాను 1,987 మంది ఉత్తీర్ణత సాధించారు. తద్వారా 77 శాతం నమోదైంది.

మెరుగుపడిన ఉత్తీర్ణత

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత శాతం గతేడాది కంటే కొంత మెరుగ్గా ఉంది. 2021-22లో మొదటి సంవత్సరంలో 59 శాతం ఫలితాలు వస్తే, 2022-23(ఈ ఏడాది)లో 63 శాతం సాధించారు. రెండో సంవత్సరం గతేడాది 65 శాతం ఫలితాలు రాగా ఈ ఏడాది 70 శాతం ఫలితాలు సాధించారు. ఇంటర్మీడియెట్ తరగతుల నిర్వహణలో అధికారులు చూపిన ప్రత్యేక కృషి ఫలితంగానే కాస్తా ఫలితాలు మెరుగుపడినట్లయింది.

ప్రభుత్వ కాలేజీల్లో మిశ్రమ ఫలితాలు

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 38 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 5,787 మంది హాజరు కాగా 1,199 మంది ఉత్తీర్ణత సాధించారు. తద్వారా 20.72 శాతం నమోదైంది. రోలుగుంట 60.29 శాతంతో మొదటి స్థానంలో నిలవగా, అనంతగిరి, ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఏ ఒక్కరు కూడా పాసవ్వలేదు. ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు 6,043 మంది హాజరు కాగా 1,970 మంది ఉత్తీర్ణులయ్యారు. జి.మాడుగుల 67.11 శాతం ఉత్తీర్ణతతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో టాప్‌గా నిలిచింది.

దీవెనతో ఉజ్వల భవిత



లబ్ధిదారులకు వసతి దీవెన చెక్కు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- జిల్లాలో వసతి దీవెన నిధులు రూ.34.62 కోట్ల విడుదల
- 37,377 మంది విద్యార్థులకు ప్రయోజనం
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

జిల్లాలో కేటగిరీల వారీగా లబ్ధిదారుల వివరాలు

కేటగిరీ	విద్యార్థులు	జమైన నిధులు రూ.లలో
ఎస్సీ	2,605	2.40 కోట్లు
ఎస్టీ	339	31.70 లక్షలు
బీసీ	34,184	31.67 కోట్లు
మైనార్టీ	249	23 లక్షలు

సాక్షి, అనకాపల్లి: జగనన్న వసతి దీవెన పథకం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. బుధవారం అనంతపురం జిల్లా నార్పలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వర్చువల్ విధానం ద్వారా 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి వసతి దీవెన నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37,377 మంది విద్యార్థులకు సంబంధించి రూ.34,61,72,500 వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు విద్యా బోధన, మౌలిక వసతుల కల్పనలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారాయన్నారు. జగనన్న వసతి దీవెన పథకంలో జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి టి.అజయ్‌బాబు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి, ఎస్టీ సహాయ సంక్షేమాధికారి నాగ శిరీష, బీసీ సహాయ సంక్షేమాధికారి సురేష్, వివిధ కళాశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పౌష్టికాహారం

- జిల్లాలో 1260 మందికి వైద్య సేవలు
- జిల్లా అదనపు క్షయ నిర్మూలన అధికారి కిశోర్‌కుమార్



దేవరాపల్లి పీహెచ్‌సీలో క్షయ బాధితులకు ఆహార సామగ్రి అందిస్తున్న జిల్లా అదనపు క్షయ నిర్మూలన అధికారి కిశోర్‌కుమార్, వైద్యాధికారి లలిత

దేవరాపల్లి: జిల్లాలో క్షయ బాధితులకు ఎన్‌జీవోల సహకారంతో పోషక విలువలతో కూడిన ఆహార సామగ్రిని అందిస్తున్నట్టు జిల్లా అదనపు క్షయ నిర్మూలన అధికారి సి.కిశోర్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ప్రధానమంత్రి నిక్షయ్ మిత్ర పథకంలో భాగంగా ఎన్‌జీవోల సహకారంతో దేవరాపల్లి పీహెచ్‌సీలో 20 మంది క్షయ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. లీటరు నూనె ప్యాకెట్, అర కేజీ వేరుశనగ పప్పు, కేజీ బెల్లం, కేజీ కొమ్ము శనగలు, పెసరపప్పు, కందిపప్పు, రాగిపిండి, గోధుమలు కేజీ చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.500 చొప్పున నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. జిల్లాలో 1260 మంది బాధితులు చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి, కె.కోటపాడు టీబీ యూనిట్ అధికారి ఎస్.లలిత, టీబీ సూపర్‌వైజర్ ఎస్.స్వామినాయుడు, ల్యాబ్ సూపర్‌వైజర్ వి.సత్తిబాబు, పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, పుష్పరాజ్, ఫార్మాసిస్టు అల్లు సత్యమూర్తి పాల్గొన్నారు.

అప్పన్న నిత్య కల్యాణం పునఃప్రారంభం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణం బుధవారం పునఃప్రారంభమైంది. చందనోత్సవం సందర్భంగా 25 రోజులపాటు నిలిపివేసిన నిత్య కల్యాణాన్ని బుధవారం తిరిగి ప్రారంభించారు. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి స్వామికి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

నీలిమకు సాగా ఆఫ్ ది విమెన్ అవార్డు



బోగాది నీలిమ

అచ్యుతాపురం (అనకాపల్లి): ఏటికొప్పాకపై డాక్యుమెంటరీ తీసిన బోగాది నీలిమ 'సాగా ఆఫ్ ది విమెన్' అవార్డు సాధించారు. విశాఖ లలితానగర్‌కు చెందిన ఆమె ప్రస్తుతం దామోదరయ్య సంజీవయ్య లా యూనివర్సిటీలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. ఏప్రిల్ 26న ప్రపంచ మేధోసంపత్తి దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్త మహిళా మేధోసంపత్తిపై జరిగిన ఓటింగ్‌లో నీలిమకు ప్రపంచంలో రెండో స్థానం వచ్చింది. చైనాకు చెందిన థాయోయింగ్‌జాంగ్‌కు మొదటి స్థానం లభించింది. ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 23,160 మంది నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి, మేధో సంపత్తితో కూడిన 183 వీడియోలను ఓటింగ్‌కు పెట్టింది. 73 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో నీలిమ రెండో స్థానం సాధించి ప్రపంచంలో ప్రతిభావంతులైన మహిళల్లో ఒకరిగా నిలిచింది.

విశాఖలో కిడ్నీ రాకెట్ కలకలం

పీఎం పాలెం (విశాఖ): విశాఖలో కిడ్నీ రాకెట్ వ్యవహారం సంచలనం రేకెత్తిస్తోంది. డబ్బు ఆశ చూపి ఒక వ్యక్తి నుంచి అనధికారికంగా కిడ్నీ తొలగించిన వ్యవహారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ వాంబేకాలనీలో గోరుజల్ల వినయ్‌కుమార్ నివసిస్తున్నాడు. అదే కాలనీలో ఉంటున్న కామరాజు అనే వ్యక్తి కుమార్ ఇంటికి వచ్చి కిడ్నీ అమ్మి సులువుగా డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపించాడు. కిడ్నీ ఇస్తే రూ.8.5 లక్షలు ఇస్తానని నమ్మించాడు. కుమార్‌ను 2022 అక్టోబరు 17న కలెక్టర్ ఆఫీస్ సమీపంలో ఉన్న విజయ డయాగ్నస్టిక్ సెంటర్‌కు తీసుకెళ్లి అక్కడ వైద్య పరీక్షలు చేయించాడు. ఇంతలో కుమార్ భయపడి 2022 నవంబర్‌లో హైదరాబాదులో ఉన్న తన కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లిపోయాడు. కొద్ది రోజుల తర్వాత కుమార్‌కు కామరాజు ఫోన్‌చేసి కిడ్నీ ఇవ్వకపోతే వైద్య పరీక్షలకు ఖర్చు అయిన రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో కుమార్ కిడ్నీ ఇవ్వడానికి అంగీకరించి విశాఖకు వచ్చాడు. 2022 డిసెంబరు 16న కామరాజు, ఎలీనా, శ్రీను అతడిని పెందుర్తిలో ఉన్న తిరుమల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అదే రోజు అర్ధరాత్రి ఆస్పత్రి వైద్యులు కుమార్ కిడ్నీ తీసుకున్నారు. అనంతరం కుమార్‌ను ఆస్పత్రిలోనే వదిలేసి కామరాజు వెళ్లిపోయాడు. అదే నెల 24న కుమార్ ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకున్నాడు. కుమార్ ఆస్పత్రిలో ఉన్న సమయంలో రూ.5 లక్షలు చూపించి అందులో రూ. 2.5 లక్షలు మాత్రమే కామరాజు, శ్రీను ఇచ్చినట్టు కుమార్‌కి అతని తల్లి చెప్పింది. అప్పటి నుంచి మిగిలిన డబ్బులు ఇవ్వాలని కోరినప్పటికీ వారు తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో కామరాజు, ఎలీనా, శ్రీనుతోపాటు ఆసుపత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కుమార్ మంగళవారం రాత్రి పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆనందం.. అంతలోనే విషాదం

సొంతూరులో గ్రామదేవత ఉత్సవాలకు హాజరైన ఓ కుటుంబం గమ్యానికి చేరుకోకుండానే మృత్యువు దారికాసి కబళించింది. కారు ప్రమాద రూపంలో ముగ్గురి ప్రాణాలను బలిగొంది. అదుపుతప్పి రక్షణగోడను ఢీకొట్టిన కారు లోయలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఇద్దరు సంఘటన స్థలంలోను మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పాడేరు-చోడవరం ప్రధాన రహదారిలోని కోమాలమ్మ తల్లి ఘాట్ మలుపు వద్ద బుధవారం సాయంత్రం ఆరు గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది.

- అదుపు తప్పిన కారు
- రక్షణగోడను ఢీకొని లోయలోకి దూసుకెళ్లిన వాహనం
- సంఘటన స్థలంలో ఇద్దరు, ఆస్పత్రిలో మరొకరు మృతి
- ప్రాణాలు కోల్పోయిన వారిలో దంపతులు
- మృతుల్లో సుబ్బారావు విశాఖలో ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్



సంఘటన స్థలంలో కారు నుంచి క్షతగాత్రులు, మృతదేహాలను బయటకు తీస్తున్న వాహనదారులు



సుబ్బారావు మృతదేహం



దంపతుల పాత చిత్రం

పాడేరు రూరల్ : జిల్లాలోని ముంచంగిపుట్టు మండలం కిలగాడ గ్రామానికి చెందిన చెండా సుబ్బారావు(55), భార్య మహేశ్వరి(50) విశాఖ నగరంలోని పెదవాల్తేరు దరి పోలమాంబ ఆలయానికి సమీపంలోని ఎల్ఐసీ క్వార్టర్లలో ఉంటున్నారు. చెండా సుబ్బారావు విశాఖలో ఎల్ఐసీ కార్యాలయంలో డివిజనల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

కిలగాడలోని గంగమ్మతల్లి ఉత్సవాలకు..

స్వగ్రామం కిలగాడలో మంగళవారం జరిగిన గంగమ్మతల్లి పండగకు భార్యాభర్తలు చెండా సుబ్బారావు, మహేశ్వరి విశాఖ నుంచి కారులో వచ్చారు. పండగ ముగియడంతో బుధవారం సాయంత్రం భార్యభర్తలు సుబ్బారావు, మహేశ్వరితోపాటు బంధువు సమరెడ్డి పూర్ణచంద్రరావు కారులో విశాఖ బయలుదేరారు. పాడేరు- చోడవరం ప్రధాన రహదారిలోని కోమాలమ్మ తల్లి ఘాట్ మలుపు వద్దకు వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రక్షణగోడను ఢీకొట్టింది. లోయలోకి దూసుకుపోయింది. సంఘటన స్థలంలోనే మహేశ్వరితోపాటు కారు డ్రైవర్ కంద్రాపు ఉమామహేశ్వరరెడ్డి తీవ్రంగా గాయపడి మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన సుబ్బారావు, సమరెడ్డి పూర్ణచంద్రరావునుఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు బయటకు తీశారు. 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బారావు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కారు డ్రైవర్ విశాఖలోని రెడ్డి కంచరపాలెంకు చెందిన వ్యక్తిగా వారు పేర్కొన్నారు. పూర్ణచంద్రరావు ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సంఘటన స్థలంలోని మహేశ్వరి, కారు డ్రైవర్ ఉమామహేశ్వరరెడ్డి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు సుబ్బారావు, మహేశ్వరికి ఇద్దరు సంతానం ఉన్నారు.

బీమాతోనే జీడి రైతుకు ధీమా



జీడిమామిడితోట నుంచి సేకరించిన జీడిపళ్లు (ఇన్‌సెట్) జీడిపిక్కలు

- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో తీర్మానం
- మూడేళ్లుగా దిగుబడి లేక జీడిమామిడి రైతు దిగాలు
- సుమారు 88 వేల మందికి నష్టం
- ఈ క్రాప్ బుకింగ్‌లో 66 వేల హెక్టార్ల జీడిమామిడి నమోదు

సాక్షి, అనకాపల్లి: మూడేళ్లుగా దిగుబడి లేక జీడిమామిడి రైతులు దిగులు చెందుతున్నారు. అధిక ఆదాయాన్ని ఆర్జించే జీడిమామిడి రైతులు గతేడాదిలాగే ఈసారి కూడా దిగుబడి లేక నష్టపోయారు. వాతావరణ మార్పుల కారణంగా ఈ ఏడాది ప్రారంభంలో పూత, పిందెలు బాగా రావడంతో ఈసారైనా పెట్టుబడులకు తగ్గ దిగుబడి వస్తుందేమో అనే ఆశతో రైతులంతా ఆశలు పెట్టుకున్నారు. కానీ వారికి నిరాశే మిగిలింది. పూత దశలోనే తెగుళ్లు వెంటాడాయి. వాతావరణ మార్పుల కారణంగా ఈసారి దిగుబడి భారీగా తగ్గిపోయింది. కొద్దిగా కోతకు వచ్చిన జీడిమామిడి పంటకు సరైన ధర లభించకపోవడం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న ప్రతీ రైతుకు ప్రభుత్వం ఉచిత బీమా కల్పిస్తూ.. ఆదుకోవాలని ఇప్పటికే జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో ఈ క్రాప్‌లో 66,049 హెక్టార్ల జీడిమామిడి సాగు నమోదు చేశారు. సుమారుగా 88 వేల మంది జీడిమామిడి రైతులు ఈ క్రాప్ బుకింగ్ నమోదు చేసుకున్నారు.

ఆశ నిరాశే...

సాధారణంగా మార్చి, ఏప్రిల్ నెలాఖరు నాటికి జీడిమామిడి రైతులకు పంట చేతికందుతుంది. జీడిమామిడిలో కూడా తొలసరి, మలసరి అని రెండు కాపులు ఉంటాయి. డిసెంబర్, జనవరి నెలల్లోనే పూత పూసి.. ఫిబ్రవరి నెలలో పిందె వేసి.. మార్చి నెలలో పూర్తిగా కాపు కాస్తాయి. అలా కాకుండా ప్రారంభంలో పూత వచ్చి మాడిపోయి.. ఫిబ్రవరి, మార్చిలో వచ్చే పూత, పిందెలను మలసరి కాపుగా చెబుతారు. ప్రారంభంలో వచ్చిన పూత, పిందె నిలబడి కాపు కాస్తే పంట దిగుబడి బాగా వచ్చినట్లు. ఒకవేళ వాతావరణం మార్పు కారణంగా, మంచు ప్రభావంతో తొలసరి పూత మాడిపోతే... రెండో విడతలో వచ్చే పూత, పిందెతో కాసింత కాపుతో అంతగా లాభాలార్జించలేరు. ఈ ఏడాదిలో రెండో పూతలోనైనా చిగురిస్తుందేమో అని ఆశగా చూశారు. ఈ పంట ఫిబ్రవరి, మార్చి నెలకే పూత పూసి.. ఏప్రిల్, మే నెలల్లో పంట చేతికందుతుంది. ఈసారి ఇందులోనూ నిరాశే మిగిలింది. బోరు ఆధారిత హైబ్రిడ్ జీడి మొక్కల్లో తేనె మంచు కారణంగా పూత దశలోనే చాలావరకు పంట పోయింది. అక్కడక్కడ కాపు కాసినా.. పెట్టుబడులే రాలేదంటూ రైతులు వాపోతున్నారు.



జీడిమామిడి తోటలు

బీమాతో ఆదుకోవాలి

కోటవురట్ల మండలం పిప్పళ్ల కొత్తపల్లి పంచాయితీ రెవెన్యూ పరిధి ఆక్సాహెబ్‌పేట గ్రామంలో నాకు 5.75 ఎకరాల జీడిమామిడి తోట వుంది. ఏటా 30 బస్తాల జీడి పిక్కలు పండేవి. గత మూడేళ్లుగా వాతావరణ మార్పుల కారణంగా ఆశించిన స్థాయిలో పెట్టుబడికి తగిన దిగుబడి రాలేదు. ఈ ఏడాది ప్రారంభంలో జీడిమామిడి పూత, పిందె బాగానే నిలిచాయి. ఈ ఏడాదైనా దిగుబడి బాగుంటుందేమో అనుకున్నాను. ఏడాదిగా పెట్టిన పెట్టుబడి పోయి పెద్దగా మిగిలిందేమి లేదు. ఈ నెలాఖరు కాపు కూడా పూర్తయిపోయింది. ఉద్యానపంటలను కూడా ఈ క్రాప్‌లో నమోదు చేశారు. జీడిమామిడి పంటలకు కూడా ఉచిత బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరుతున్నాం.

– బి.చంటిబాబు, జీడిమామిడి రైతు

ఉద్యాన రైతులకు అండగా సీఎం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలుస్తున్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆర్‌బీకేలను సృష్టించి.. వాటి ద్వారా విత్తనాల నుంచి యంత్రాల వరకూ సబ్సిడీలు కల్పిస్తూ.. ధాన్యం కొనుగోలు చేస్తూ రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఇదే తరహాలో ఉద్యానపంటలను కూడా ఈక్రాప్‌లో నమోదు చేయడం జరిగింది. ఉద్యానవన పంట అయిన జీడిమామిడి రైతులకూ బీమా వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని కోరాం. ఉచిత బీమా వర్తింపచేయాలని ప్రభుత్వానికి తీర్మానం చేసి పంపించాం. ఈ నెలలో జరిగిన వ్యవసాయ సలహామండలి సమావేశంలో ప్రధానంగా జీడిమామిడి రైతులపైనే చర్చించాం.

– చిక్కాల రామారావు, ఉమ్మడి విశాఖ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్

క్లుప్తంగా

నూకాంబిక ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో దేవదాయ ధర్మదాయ చట్టం 30/1987, సెక్షన్ 15 ప్రకారం ధర్మకర్తల మండలిని నియమించనున్నట్టు ఆలయ ఈవో బి.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు స్థానిక దేవాలయ ఆవరణలోను, జిల్లా కమిషనర్ కార్యాలయంలోను దరఖాస్తుల్ని తీసుకుని, పూర్తిచేసిన దరఖాస్తులను విశాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి అందజేయాలని కోరారు. నోటిఫికేషన్ విడుదల చేసిన తేదీ నుంచి 20 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుని వయసు 30 ఏళ్ల పైబడి ఉండాలన్నారు. వివరాలకు నూకాంబిక అమ్మవారి దేవాలయ ఈవో కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

మద్యం కేసులో ఆరుగురి అరెస్ట్


రావికమతం : బహిరంగ ప్రదేశాల్లో, దాబాల్లో మద్యం సేవిస్తూ పలువురికి అసౌకర్యాన్ని కలిగించిన ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ బుధవారం తెలిపారు. టి.అర్జాపురం గ్రామంలో కొంత మంది బహిరంగ ప్రదేశాలు, దాబాల్లో మద్యం సేవించి స్థానికులను ఇబ్బంది పెడుతున్నారన్న ఫిర్యాదు మేరకు బుధవారం దాడులు నిర్వహించామన్నారు. మెయిన్ రోడ్డులోని దాబాలో మద్యం మత్తులో ఉన్న ఆరుగుర్ని అరెస్ట్ చేసి, కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. వారినుంచి నాలుగు మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఇకపై దాబాల్లో మద్యం సేవిస్తే ఆ దాబా నిర్వాహకునిపై కూడా కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

ఉచిత ప్రవేశాలకు నేటితో గడువు పూర్తి

విశాఖ విద్య: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు సీట్లు పొందిన విద్యార్థులు గురువారంలోగా చేరాలని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. విద్యాహక్కు చట్టం మేరకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దరఖాస్తుదారుల్లో ఎంపికైన వారి మొదటి విడత జాబితా ఇప్పటికే విడుదలైందన్నారు. సీట్లు పొందిన వారంతా ఆయా పాఠశాల్లో ప్రవేశాలు పొందాలన్నారు. ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రెండో విడత జాబితా మే 2న విడుదల చేస్తామన్నారు.

చిట్టీ.. యూ నో ఎవ్రీ థింగ్

- సూసైడ్ నోట్ రాసి గర్భిణి ఆత్మహత్య
- ఆర్.కె.బీచ్ ఇసుకలో కూరుకుపోయిన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు
- వరకట్న వేధింపులే కారణం: మృతురాలి తల్లి



సూసైడ్ నోట్



శ్వేత (ఫైల్)

బీచ్‌రోడ్డు (విశాఖ): 'చిట్టీ.. నాకు ఎప్పుడో తెలుసు.. నేను లేకుండా నువ్వు బిందాస్‌గా ఉండగలవని. నీకు అసలు ఏ మాత్రం ఫరక్ పడదు. ఎనీ వే ఆల్ ద బెస్ట్ ఫర్ యువర్ ఫ్యూచర్ అండ్ న్యూ లైఫ్. చాలా మాట్లాడడానికి ఉన్నా కూడా నేను ఏం మాట్లాడటం లేదు. బికాజ్.. నువ్వు బయటకు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా యూ నో ఎవ్రీ థింగ్. జస్ట్ క్వశ్చన్ యువర్ సెల్ఫ్. ఏ బిగ్ థ్యాంక్స్ ఫర్ ఎవ్రీ థింగ్' అంటూ భర్తకు లేఖ రాసి ఐదు నెలల గర్భిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ సమయంలో ఎంతో ఆనందంగా గడపాల్సిన ఆమె..ఆర్.కె.బీచ్‌లో విగతజీవిగా కనిపించింది. వరకట్న వేధింపులే తన కుమార్తె మరణానికి కారణమని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ..

పెదగంట్యాడ మండలం నడుపూరులో గురువెల్లి మణికంఠ తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. దొండపర్తికి చెందిన శ్వేత(24)తో గత ఏడాది మణికంఠకు వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. మణికంఠ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వారం రోజుల కిందట అతను హైదరాబాద్ వెళ్లాడు. శ్వేతను ఇక్కడే అతని తల్లిదండ్రుల వద్ద ఉంచాడు. మంగళవారం సాయంత్రం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె సాయంత్రం 6.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. తర్వాత ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆమె అత్తామామలు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేశారు. ఫలితం లేకపోవడంతో ఆమె మామ శాంతారావు అర్ధరాత్రి 12 గంటల సమయంలో న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రాత్రి పెట్రోలింగ్ చేసే పోలీసుల గ్రూపులో ఆమె ఫొటో పోస్ట్ చేసి అదృశ్యమైందని వివరాలు పెట్టారు. అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో ఆర్.కె. బీచ్‌లో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు 3వ పట్టణ పోలీసులు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని శ్వేత ఫొటోతో సరిపోలి్చ.. న్యూపోర్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇసుకలో కూరుకుపోయిన ఆమె మృతదేహాన్ని చూసి.. ఎవరో హత్య చేసి తీరంలో పూడ్చేసినట్లు ముందు అనుమానాలు వ్యక్తమయ్యాయి. తన భర్తతో ఉన్న కుటుంబ కలహాలతో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో తేలింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

వివాహమై ఏడాది పూర్తి

శ్వేత, మణికంఠ దంపతుల మొదటి వివాహ వార్షికోత్సవం ఈ నెల 15న జరిగింది. అనంతరం మణికంఠ హైదరాబాద్ వెళ్లాడు. శ్వేత మరణ వార్త తెలియగానే వెంటనే నగరానికి చేరుకున్నాడు. ఆత్మహత్యకు ముందు ఆమె రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో చిట్టీ(మణికంఠ ముద్దు పేరు) నేను లేకపోయినా నువ్వు బిందాస్‌గా జీవిస్తావని నాకు తెలుసు. బెస్ట్ ఆఫ్ లక్ ఫర్ యువర్ ఫ్యూచర్. బిగ్ థ్యాంక్స్ ఫర్ ఎవ్రీ థింగ్ అని రాసి ఉంది.

భర్త ప్రేమకు నోచుకోలేదు

పెళ్లి అయిన తర్వాత అత్త, మామ, ఆడపడుచు భర్త ఎంతగానో నా బిడ్డను వేధించారని శ్వేత తల్లి రమాదేవి ఆరోపించారు. 'ఆ ఇంట్లో ఉండలేకపోతే వచ్చేయమ్మా.. పెంచుకుంటా అని చెప్పాను. అయినా సరే భర్త ప్రేమ కోసం ఆ ఇంట్లోనే ఉంది. ఐదు నెలల గర్భంతో ఉన్న నా కుమార్తెపై కనీసం కనికరం లేకుండా అత్తమామలు చిత్రహింసలకు గురి చేశారు. ఇంట్లో పనులన్నీ తనతోనే చేయించారు. అల్లుడు వాళ్ల అమ్మానాన్నలకే వత్తాసు పలికేవాడు. ప్రతి రోజూ ఫోన్ చేసి ఏడ్చేది. నెల రోజుల కిందట విడాకులు ఇస్తామని శ్వేతను మణికంఠ బెదిరించాడు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతానని చెప్పింది. పెళ్లైన తర్వాత చదివించకుండా వంటింటికే పరిమితం చేశారు. నా ఒక్కగానొక్క కుమార్తెను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారు' అంటూ ఆమె వాపోయారు. వరకట్నం వేధింపులే తన కుమార్తెకు మరణానికి కారణామని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కట్నం తీసుకురావాలని కొద్ది నెలలుగా వేధిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు శ్వేత భర్త మణికంఠ, అత్త, మామ, ఆడపడుచు భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయిలో కేసును విచారిస్తున్నట్లు తెలిపారు.

ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందని భావించా..

'శ్వేత బి.టెక్ సివిల్ ఇంజినీర్ చదువుకుంది. సివిల్స్ సాధించాలని నిరంతరం చదువుకునేది. అందుకు నేను కూడా ప్రోత్సహించా. కుటుంబంలో చిన్న చిన్న గొడవలు సహజం. ఆ మాత్రానికే ఆత్మహత్య చేసుకుంటుందని అనుకోలేదు. ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందని భావించాను. ఇలా శవమై మమ్మల్ని బాధపెట్టింది' అని మణికంఠ తెలిపారు.

ఇంటర్‌లో సత్తాచాటిన సర్కారీ విద్యార్థులు

మాడుగుల రూరల్/దేవరాపల్లి/రోలుగుంట : ఇంటర్ ఫలితాల్లో సర్కారీ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకుల కళాశాలలు, కేజీబీవీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

- మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ విద్యార్థిని దాడి శ్రీదేవి 978 మార్కులు ఎంపీహెచ్‌డబ్ల్యూలో మొల్లేటి మృదులశ్రీ 947 మార్కులు సాధించి, ప్రతిభ చూపారు.
- తెనుగుపూడి డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఎంపీసీ విద్యార్థి ఎం.యువరాజ్ 970 మార్కులతో టాపర్‌గా నిలిచారు. ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థి ఎస్.కార్తీక్ 442 మార్కులు సాధించాడు.
- దేవరాపల్లి కేజీబీవీలో ఎంపీసీ గ్రూపులో ఎస్.వెంకటలక్ష్మి 940 మార్కులు సాధించింది.
- రోలుగుంట కెజీబీవీలో నీలిమ 971(ఎంపీసీ) మార్కులు తెచ్చుకుంది.



దాడి శ్రీదేవి (978 ఎంపీసీ) | ఎం.యువరాజ్ (976 ఎంపీసీ) | సిహెచ్.భాగ్యశ్రీ (973 బైపీసీ) | ఎం.సత్యవెంకటి (972 బైపీసీ) | నీలిమ (971 ఎంపీసీ)

నర్సీపట్నం: ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో బైపీసీ విద్యార్థులు సిహెచ్.భాగ్యశ్రీ 973, ఎం.సత్యవెంకటి 972 మార్కులు సాధించారు.

వీరికి కళాశాల ప్రిన్సిపాల్ జి.చిన్నారావు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ కంటి వెలుగును వినియోగించుకోండి



కశింకోట పంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- కంటి వైద్య శిబిరంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట : వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. కశింకోట పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో ఎంపిక చేసిన కంటి శుక్లాలు ఉన్న వారికి శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్టు తెలిపారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 160 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి, వారిలో 35 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యాధికారి జాక్సన్, సమన్వయకర్త అరుణ్‌కుమార్, సిబ్బంది శిబిరంలో సేవలందించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు సహకారంలో జరిగిన శిబిరంలో సర్పంచ్ మంత్రి జయరజని, వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, ఆరోగ్య సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు నక్కపల్లిలో సుబ్బారెడ్డి పర్యటన

'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి హాజరు



నక్కపల్లి : టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఈ నెల 28న నక్కపల్లిలో పర్యటించనున్నట్లు పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శుక్రవారం సుబ్బారెడ్డి నక్కపల్లిలో జరిగే మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం ఎస్‌రాయవరంలో జరిగే కార్యక్రమంలో కూడా సుబ్బారెడ్డి పాల్గొంటారని తెలిపారు. సుబ్బారెడ్డితోపాటు, పార్టీ జిల్లా అధ్యక్షులు కరణం ధర్మశ్రీ, జిల్లా మంత్రులు, ఎంపీలు, ముఖ్యనాయకులు కార్యక్రమానికి హాజరుకానున్నట్టు వెల్లడించారు. నాలుగు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైఎస్ ఎంపీపీలు, పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ విభాగాల నాయకులు, నియోజకవర్గం నలుమూలల నుంచి కార్యకర్తలు హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాబూరావు కోరారు.

తిమ్మాపురంలో 'ఉక్కు సత్యాగ్రహం'



ఓ సన్నివేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, తదితరులు

కొమ్మాది: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కథాంశంతో జనం ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దర్శక, నిర్మాత పి.సత్యారెడ్డి తెరకెక్కిస్తున్న ఉక్కు సత్యాగ్రహం అనే సినిమాకు సంబంధించి పలు సన్నివేశాలను బీచ్ రోడ్ తిమ్మాపురంలో గల డాక్టర్ బి.రామానాయుడు ఫిల్మ్ స్టూడియోలో బుధవారం చిత్రీకరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వల్ల ప్రజలకు జరిగే నష్టం, అన్యాయాలను తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన, ర్యాలీలకు సంబంధించి ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. ఆయన ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. సీనియర్ నటుడు ప్రసన్న కుమార్, గాజువాక ఝూన్సీలపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ప్రధాన పాత్రలో ప్రజా గాయకుడు గద్దర్ నటిస్తున్నట్లు దర్శకుడు సత్యారెడ్డి తెలిపారు.

రాణించిన శ్రీప్రకాష్ విద్యార్థులు



సిహెచ్. జ్యోత్స్న అఖిల | కె.సత్యసూర్య విజయలక్ష్మి | యు.నాగసూర్య ఉమా వెంకటేష్ | కె.స్రవంతి

పాయకరావుపేట : బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాలలో తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ఎస్ భానుమూర్తి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సీహెచ్ జ్యోత్స్న అఖిల 990, కె.సత్యసూర్యవిజయలక్ష్మి 987 మార్కులు, బైపీసీలో యు.నాగసూర్య ఉమా వెంకటేష్ 983, కె.స్రవంతి 981 మార్కులు సాధించారని వెల్లడించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో ఆర్.భాను శ్రీ తులసి వర్షిణి 465, జి.శ్రీనీల 461 మార్కులు, బైపీసీలో ఎస్.మేఘన 430, కె.లాస్యనందిని 428 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచినట్టు తెలిపారు. తమ విద్యార్థులు 10 మంది 980కి పైగా మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ ప్రకాష్ అభినందించారు.

గంజాయితో ముగ్గురి పట్టివేత

- 9 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్ల స్వాధీనం
- పట్టుబడిన వారిలో ఇద్దరు చెన్నై వాసులు



గంజాయితోతో పట్టుబడిన నిందితులతో దేవరాపల్లి ఎస్‌ఐ నాగేంద్ర

దేవరాపల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్లు దేవరాపల్లి ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు. వివరాలు.. ఏజెన్సీ నుంచి దేవరాపల్లి మీదుగా గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ నాగేంద్ర దేవరాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీసులను చూసి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ప్లాస్టిక్ సంచిలో గంజాయితో పారిపోతుండగా వారిని పట్టుకుని, అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో పట్టుబడిన వారిలో తమిళనాడు రాష్ట్రం చెన్నైకు చెందిన జయశీలన్, ఆలీ అహ్మద్, హుకుంపేట మండలం వోల్డ గ్రామానికి చెందిన కొదమ సుధాకర్ ఉన్నారు. వీరి నుంచి 9 కేజీల గంజాయిని, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.

చోరీ కేసులో ఇద్దరు మహిళలకు రిమాండ్

ఎస్.రాయవరం : రెండు రోజుల క్రితం అడ్డురోడ్డులో జరిగిన వెండి దొంగతనం కేసులో ఇద్దరు మహిళలను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపారు. కె శ్రీనివాస్‌రావు దుకాణంలో కవిడి దుర్గ అలియాస్ ఝాన్సి, కొల్లి మణి అలియాస్ పద్మ అనే ఇద్దరు మహిళలు షాపింగ్‌కి వచ్చి 308 గ్రాముల వెండి పట్టుకుపోయారన్న ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో బుధవారం వారిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు.

క్లుప్తంగా

రొంగలివానిపాలెంలో నేడు గడప గడపకు

అనకాపల్లిటౌన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం సాయంత్రం 4 గంటలకు మండలంలో రొంగలివానిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయుచున్నట్లు ఆయన చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖ ఉద్యోగులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

అప్పారావు మృతి సీపీఐకి తీరనిలోటు


అప్పారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వెంకటరమణ

అనకాపల్లిటౌన్: కామ్రేడ్ ఆడారి అప్పారావు మృతి సీపీఐ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. మండలంలో వెంకుపాలెం గ్రామంలో అప్పారావు స్వగృహంలో మృతదేహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి, శ్మశనవాటిక వరకూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలపై పోరాటాలు చేసిన మహానేత ఆడారి అప్పారావు అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో సీపీఐ నేతలు వై.ఎస్.భద్రం, రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు పాల్గొన్నారు.

తైక్వాండోలో ఉచిత శిక్షణ

తుమ్మపాల : బాలికల ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడే తైక్వాండో ఉచిత శిక్షణ శిబిరాన్ని మే 1 నుంచి 31 వరకు పట్టణంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ ఎం.సూర్యారావు తెలిపారు. తైక్వాండో నేర్చుకోవడం వల్ల బాలికలకు ఆత్మరక్షణతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, అలాగే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వేసవి శిక్షణ శిబిరం ద్వారా బాలబాలికలకు నెల రోజుల పాటు తర్ఫీదు ఇస్తున్నట్టు జిల్లా ఇంచార్జ్ సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పథకాలు సాధించిన శిక్షకులతో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్ 8341810905కు సంప్రదించాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 1,246 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,250	4,500
మొదటి రకం	3,990	4,250
రెండో రకం	3,560	3,970
మూడో రకం	3,440	3,550

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
కలియుగ భగవాన్	సత్యనారాయణ స్క్రీన్-1
ఈవిల్ డెడ్ రైజ్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
విరుపాక్ష	పర్తిసాయి
విడుదల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
శాకుంతలం	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 79 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్ 42 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 439 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 405 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

వంతెన పూర్తయితే కష్టాలు తీరినట్టే!

- గవరపేటలో సగంలో నిలిచిన పనులు
- వంతెన పూర్తికి ఎంపీ హామీ
- రైతుల్లో వెల్లివిరిసిన ఆశలు


రైతుల దోనె ప్రయాణం


కశింకోటలోని గవరపేటలో నిర్మించిన వంతెన స్తంభం

కశింకోట : కశింకోటలోని గవరపేటలో శారదా నదిపై నిలిచిపోయిన వంతెన నిర్మాణం పూర్తి కావడానికి కృషి చేస్తామని ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి తాజాగా హామీ ఇవ్వడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇకనైనా వంతెన నిర్మాణం పూర్తి కాగలదని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక గవరపేట ప్రాంతంలో నది అవతల ఇక్కడి ఎంతో మంది రైతులకు చెందిన పొలాలు, పశువుల శాలలు ఉన్నాయి. తమ పొలాలకు వెళ్లి వ్యవసాయ కార్యకలాపాలు సాగించుకోవడానికి, పశువులను సంరక్షించుకోవడానికి శారదానదిని నిత్యం దాటాల్సి ఉంటోంది. ఇందుకు నదిపై తాటి దోనెలు వినియోగిస్తున్నారు. ఇవి ఒక్కోసారి మునిగి మరణాలు సంభవించిన పలు సంఘటనలు గతంలో జరిగాయి. అయినప్పటికీ ప్రత్యామ్నాయం లేక అవస్థలు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారు. గ్రామ శివారులో వంతెన దూరంగా ఉండడం వల్ల మరింత ఇబ్బంది దృష్ట్యా దగ్గరి మార్గంగా దోనెలపై ప్రయాణించక తప్పని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో వంతెన నిర్మించాలని చాలా కాలంగా అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతూ వస్తున్నారు. దీంతో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ ప్రాంతంలో పర్యటించిన సమయంలో రైతుల ఇబ్బందులను గుర్తించి రూ.3 కోట్ల డీఎంఎఫ్ నిధులతో వంతెన మంజూరు చేశారు. దీంతో 2020 జనవరిలో అప్పటి రోడ్లు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణందాసు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పనులు మొదలు పెట్టి భూ గర్భం నుంచి భూమట్టం వరకు కాంక్రీట్, ఐరన్ వినియోగించి సుమారు పది స్తంభాలు నిర్మించారు. ఇంతలో నదిలో నీరు చేరడం, ఆ తర్వాత కరోనా రావడం తదితర కారణాల వల్ల రెండున్నర ఏళ్ల క్రితం వంతెన నిర్మాణం నిలిచిపోయింది. ఇక ఆ తర్వాత పనులు జరగలేదు. సుమారు రూ.60 లక్షల వరకు ఖర్చు చేసినట్టు సమాచారం. ఈనేపథ్యంలో తాజాగా ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి రెండు రోజుల క్రితం వంతెన నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెనను పూర్తి చేసి తమ ఇబ్బందులు తొలగించాలని ఈ ప్రాంత రైతులు ఈ సందర్భంగా విన్నవించారు. దీంతో ఎంపీ స్పందిస్తూ వంతెన నిర్మాణం పూర్తి కావడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఇకనైన వంతెన నిర్మాణం పూర్తి కాగలదని రైతులు ఆశిస్తున్నారు.

వంతెన పూర్తి చేయాలి



వంతెన లేక శారదానదిని దాటి వెళ్లి వ్యవసాయ కార్యకలాపాలు సాగించుకోవడానికి ఇబ్బంది చెందుతున్నాం. వంతెన నిర్మాణం పూర్తి కావడానికి ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి హామీ ఇవ్వడం ఆనందదాయకం. వంతెన నిర్మాణం పూర్తి అయితే మా ఇబ్బందులు ఇకనైనా తొలగిపోగలవని ఆశిస్తున్నాం.

–మళ్ల లక్ష్మి, మహిళా రైతు, కశింకోట

మూడేళ్లుగా నిలిచిన పనులు



శారదానదిపై వంతెన నిర్మించాలని చాలా కాలంగా కోరుతున్నాం. మూడేళ్ల క్రితం నిర్మాణం చేపట్టారు. ఆనందకరం. అది అసంపూర్తిగా ఆగిపోవడం వల్ల నదిపై రాకపోకలు సాగించడానికి నిత్యం ఇక్కట్లు పడాల్సి వస్తోంది. ఇకనైనా వంతెన నిర్మాణం జరిగితే ప్రజా ప్రతినిధులకు జీవితాంతం రుణ పడి ఉంటాం.

–సూరిశెట్టి ఆదిబాబు, రైతు, కశింకోట

దోనె ప్రయాణం ప్రమాదకరం



దోనెలపై నిత్యం నదిని దాటడం భయంగా ఉంటోంది. నీటి మట్టం అధికంగా ఉన్నప్పుడు నదిని దాటడం మరింత కష్టమవుతోంది. దీని దృష్ట్యా వంతెన నిర్మాణం పూర్తయితే మా కష్టాలు తీరినట్టే.

–మద్దాల సత్యారావు, కశింకోట

జీవ నియంత్రణ పద్ధతులతో రైతులకు లాభం


సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

అనకాపల్లిటౌన్ : సహజ వ్యవసాయ విధానాలను ఆచరించే గిరి రైతులకు జీవ నియంత్రణ పద్ధతులు ఎంతగానో ఉపకరిస్తాయని గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. అల్లూరి జిల్లా డుంబ్రిగూడ మండలం కిల్లోగూడు గ్రామం ఐసీఏఆర్ జాతీయ వ్యవసాయ కీటక వనరుల కార్యాలయంలో ఈనెల 12వ తేదీన జరిగిన క్విక్ రెన్యువల్ రివ్యూటీం(క్యూఆర్)తో ఆయన సమావేశమయ్యారు. ఈ విధానం ద్వారా రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. కాలుష్య రహిత వ్యవసాయ ఉత్పత్తులు పండించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, చింతపల్లి ఏడీఆర్‌లు ఏడీఆర్ ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు, ఎం.సురేష్, జీవ నియంత్రణ శాస్త్రవేత్త ఎం.విశాలాక్షి, శాస్త్రవేత్తలు ముకుందరావు, రమణమూర్తి, ఉమామహేశ్వరరావు, రాజ్‌కుమార్, చిట్టిబాబు, సంజీవిని రైతు ఉత్పత్తిసంఘం దేవుడులు, టీం చైర్మన్ హెచ్.సీ.శర్మ, టీం సభ్యులు, 20 గ్రామాలకు చెందిన 121 మంది గిరిరైతులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు


రోగులకు పౌష్టికాహార కిట్లు అందిస్తున్న తుమ్మపాల పీహెచ్‌సి వైద్యాధికారిణి వాణిజగదీశ్వరి

అనకాపల్లి రూరల్ : ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో చికిత్స పొందుతున్న 12 మంది క్షయ రోగులకు వైద్య సిబ్బంది బుధవారం పౌష్టికాహార కిట్లు అందజేశారు. టీబీ నిర్మూలనలో భాగంగా ప్రతి నెలా క్షయ రోగులకు పోషకాహార కిట్లను అందజేస్తున్నారు. 2025 నాటికి టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని దీనిలో భాగంగా టీబీ రోగులకు రోగ నిరోధక శక్తి పెంపొందించడానికి పోషకాహార లోపం లేకుండా కిట్లు ఉపయోగపడతాయని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు ఎస్.వాణీ జగదీశ్వరి అన్నారు. కార్యక్రమంలో డీఎల్ ఏటీవో ఎం శారదాబాయి, సిహెచ్‌వో డాక్టర్ సుమేధ మేఘన, ఎంపీహెచ్‌ఈవో జె. శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఎస్ బి.సంగం, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ ఎం.పెంటయ్య, ఫార్మాసిస్టు సత్యసుధ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలి

అనకాపల్లిటౌన్ : ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు అన్నారు. స్థానిక గవరపాలెం అరుంధతీనగర్ కమ్యూనిటీ హాలులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఇటీవల తిరుపతిలో జరిగిన సమావేశంలో 50 రోజుల్లో జిల్లాలో ఉన్న గ్రామ, మండలంలో ఉన్న అన్ని విభాగాలకు సంబంధించి కమిటీలు వేయాలని సూచన మేరకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటి వరకు పని చేసిన కమిటీలను రద్దు చేస్తూ నూతన కమిటీలు ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్‌లో రాణించిన విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ కె.జనార్ధన్

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో స్థానిక డాక్టర్ హిమశేఖర్ కళాశాల విద్యార్థులు జిల్లాలో అగ్రగామిగా నిలిచారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో విభాగంలో 470 మార్కులకు గాను కె.దిలీప్‌కుమార్ 464, పి.నిఖిల్ 461, కె.శ్రీనివాసరావు, నిహారికలు 459 సాధించారు. బైపీసీలో ఎం.ప్రియ 440/421, కె.రమేష్ 417, ద్వితీయసంవత్సరం ఎంపీసీలో పి.జ్ఞానలోహిత 1000/981, కె.కావ్య 978, పి.గణేష్ 977, వై.జోయ్ సృజన 977 మార్కులు సాధించగా ఐఐటీ క్యాంపస్‌లో స్పెషల్ బ్యాచ్‌లో ఉన్న విద్యార్థులందరూ అద్భుత ఫలితాలు సాధించడం పట్ల కళాశాల కరస్పాండెంట్ కె.జనార్ధన్ విద్యార్థులను అభినందించారు.

ఉపాధ్యాయుల నిరసన

అనకాపల్లి రూరల్ : పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆకస్మిక తనిఖీలతో ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం ఏఎంఏఎ స్కూల్ వద్ద నిరసన తెలిపారు. 10వ తరగతి మూల్యాంకనం జరుగుతున్న కేంద్రం వద్ద భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులంతా ప్రవీణ్ ప్రకాష్ చేపడుతున్న సస్పెన్షన్లను తప్పుబడుతూ అలాంటి చర్యలు మానుకోకపోతే భవిష్యత్తులో తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గొంది చిన్నబ్బాయ్, జనరల్ సెక్రటరీలు సుధాకర్, కో చైర్మన్‌సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు తక్షణం చేపట్టాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ ప్రసాద్

కశింకోట: వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ లే-అవుట్లలో స్థలాలు పొందిన లబ్ధిదారులు తక్షణమే ఇళ్ల నిర్మాణం చేపట్టి నిర్మించుకోవాలని గృహ నిర్మాణ శాఖ డీఈ ప్రసాద్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, హౌసింగ్ సిబ్బందితో బుధవారం నిర్వహించిన వారం సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలు పూర్తి కావడానికి చర్యలు తీసుకోవాలన్నారు. లే-అవుట్లలో నిర్మాణాలకు అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని, మోసయ్యపేట లే-అవుట్‌కు వెళ్లడానికి మదుం నిర్మించాలని, ఏఎస్ పేటలో బోరు వేసినా నీరు పడనందున ప్రత్యామ్నాయంగా నీటి సదుపాయం కల్పించాలని హౌసింగ్ సిబ్బంది సమావేశం దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ దుకాణాలకు ప్రతి బుధవారం వేలం

అనకాపల్లిటౌన్ : జోన్ పరిధిలో దుకాణాలు, కల్యాణ మండపాలు, చేపల మార్కెట్‌కు ప్రతి బుధవారం 11 గంటలకు జోనల్ కార్యాలయంలో బహిరంగా వేలం నిర్వహిస్తున్నట్లు జెడ్సీ పి.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు. షాపులకు గెజిట్‌లో సూచించిన విధంగా, కల్యాణ మండపం రూ.3లక్షలు, చేపలబజారు దుకాణాలకు రూ.44వేలు ముందుగా డీడీలు తీసుకుని వేలంపాటలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

పక్కి దివాకర్ మృతి బీసీలకు తీరనిలోటు

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ ఆకస్మిక మరణం పట్ల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు బుధవారం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బీసీల అభివృద్ధి కోసం రాజీలేని పోరాటం చేశారని పేర్కొన్నారు. పక్కి మరణం బీసీ వర్గాలకు తీరని లోటని తెలిపారు.

ప్రజలకు నూరుశాతం ఆధార్ సేవలు అందాలి


ప్రత్యేక ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

కోటవురట్ల: ప్రజలకు ఉపయోగం కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, నూరుశాతం ప్రజలకు ఉపయోగపడేలా సిబ్బంది పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ తెలిపారు. ఆమె బోడపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఆధార్‌లో పేర్లు మార్పులు, చేర్పులు ఇతర సమస్యలు వెంటనే పరిష్కారం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌తో పాటు ఆధార్ ప్రత్యేక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉంటే చాలు... ప్రభుత్వ పథకం అందాల్సిందే..


గడప గడపకు కార్యక్రమంలో వికలాంగుడి సమస్యను వింటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : కులం చూడం.. మతం చూడం.. పార్టీ చూడం.. అంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మనసా.. వాచా.. పదే పదే చెబుతున్నారు..నాలుగేళ్ల పాలనలో అక్షర సత్యాలై కనిపిస్తున్నాయి.. గత ప్రభుత్వం తమ పార్టీ వారికే పథకాలన్నీ కట్టపెట్టుకున్న వైనం చూశా.. జగన్ పాలనలో పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్టు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో కుంచంగి గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ ప్రజల సమస్యలపై తిరుగుతున్న సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు సకాలంలో నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం ఆనందాన్ని కలిస్తుందని లబ్ధిదారులు చెబుతున్నారని అన్నారు. గ్రామంలో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ సమస్యను శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లులాంటివన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసే బాధ్యత మన అందిరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామ సర్పంచ్ పల్లెల నాగలక్ష్మీ, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు మ(త్రి)పల్లి శోభ, పార్టీనేతలు పి.సాయి, దొరబాబు, నాయుడు, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందాలి


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్


బీపీ తనిఖీ చేయించుకుంటున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యసౌకర్యం కల్పించాలని గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో పిసినికాడ పంచాయతీ బీఆర్‌టీ కాలనీలో రూ.25.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ (వెల్నెస్ సెంటర్)ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర వైద్యానికి కావాల్సిన మందులు అన్ని క్లినిక్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆస్పత్రిలో మందుల కొరత ఏర్పడకుండా చూసుకోవాలని, వైద్యానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించి వైద్యులు ప్రభుత్వ మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్ మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, వైద్యులు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్‌లో రైతులకు న్యాయం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎ.బాలకృష్ణ

అనకాపల్లిటౌన్ : ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు ప్రత్యామ్నాయ భూమి వెంటనే ఇవ్వాలని కాంగ్రెస్, వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ వద్ద బుధవారం ఒక రోజు నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు ఐ.ఆర్.గంగాధర్ మాట్లాడుతూ మండలంలో సంపతిపురం, తమ్మయ్యపేట, వేటజంగాలపాలెం, కూండ్రం, కుంచంగి, సీతానగరం గ్రామాల్లో జీవో నంబర్. 72 ప్రకారం దళిత బహుజన పేదలకు ఇచ్చిన డీ-పట్టా భూములను, జగనన్న గృహాలకు అందజేయడం జరిగిందన్నారు. సీపీఎం డివిజన్ నాయకుడు ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ పేదల చేతిలో ఉన్న భూములు ఇచ్చే వరకూ అధికారులు వారికి అరచేతిలో వైకుంఠం చూపారని, భూములు ఇచ్చిన రైతుల సమస్యను అధికారులు గాలికి వదిలేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేత కొణతాల హరనాథ్‌బాబు, వామపక్షాల నేతలు పి.ఎస్.అజయ్‌కుమార్, ఈరుగుల శంకరరావు, రమణమ్మ, నాగేశ్వరరావు, కింతాడ నాగరాజు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీల వద్దకే గ్రామీణ బ్యాంకు సేవలు


సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ తేజ

కశింకోట : మండలంలోని బుచ్చియ్యపేట గ్రామంలో వైఎస్సార్ ఆసరా కింద నగదు అందించడానికి బ్యాంకుకు వచ్చే అవసరం లేకుండా స్వయం సహాయక సంఘాల లబ్ధిదారుల వద్దకే నేరుగా బ్యాంకు అధికారులు, సిబ్బంది వెళ్లి అవసరమైన తీర్మాన పుస్తకాలను బుధవారం సేకరించే కార్యక్రమం చేపట్టారు. కశింకోట గ్రామీణ వికాస బ్యాంకు శాఖ మేనేజర్ ఎం.తేజ బుచ్చియ్యపేటలో నిర్వహించిన స్వయం సహాయక సంఘాల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడి 30 స్వయం సహాయక సంఘాల్లో 362 మంది మహిళా సభ్యులకు రూ.26.45 లక్షల మూడో విడత ఆసరా నగదు మంజూరైంది. ఈ మేరకు స్వయంగా తీర్మాన పుస్తకాలను పరిశీలించి లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా మంజూరైన నగదు జమ చేస్తామని మేనేజర్ తెలిపారు. బ్యాంకు శాఖకు సంఘాల ప్రతినిధులు రానవసరం లేదన్నారు. పీఎంజేబీవై , పీఎం ఎస్‌బీవై బీమాలో మహిళలు చేరాలన్నారు. ఈ సందర్భంగా పది మంది సభ్యులతో స్వయం సహాయక సంఘాన్ని కొత్తగా ఏర్పాటు చేశారు. వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, సీసీ అనూరాధ, వీవోఏ నాగలక్ష్మి, కార్యదర్శి వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి


కూలీలతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

కోటవురట్ల : వేసవిని దృష్టిలో పెట్టుకొని కూలీలు ఉదయమే పనులు వెళ్లాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ తెలిపారు. ఆమె మండలంలో చౌడవాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి అధికంగా ఉన్నందున ఉదయం 6 గంటలకే పనులకు హాజరు కావడం వల్ల కూలీలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. అలాగే రోజూ రూ.272 గిట్టుబాటు అయ్యేలా పనులు చేయాలని తెలిపారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో ఎన్ఆర్‌ఈజీఎస్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ రోజా రమణి ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పేర్లు నమోదు చేసుకున్న ప్రతి కూలీ పనులు వెళ్లేలా చూడాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు అందేలా సిబ్బంది వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో గంగునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు రేపు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే విద్యా సంస్థల్లో 5,6,7,8, ఇంటర్ ఫస్టియర్, డిగ్రీ ఫస్టియర్ 2023–24 సంవత్సరాల్లో ప్రవేశానికి దరఖాస్తుకు ఈ నెల 28వ వరకూ గడువు పొడిగించారని ఏపీఆర్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.మధు తెలిపారు.